

రేపు వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు ఉత్సవాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించనున్నామని డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ స్టేడియంలో శిబిరాల్లో 17 క్రీడాంశాల్లో ఉచితంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించగా దాదాపు 2500 మంది విద్యార్థులు శిక్షణ తీసుకున్నారన్నారు. శిక్షణ పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలను అందించనున్నామని తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతితో పాటు జిల్లా అధికారులు, నాయకులు హాజరవుతారన్నారు.

వంద రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలి

సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ బోనగిరి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న బోనగిరి శ్రీనివాస్

కరీంనగర్ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ వంద రోజుల ప్రణాళికను విజయవంతం పూర్తి చేయాలని సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన నగరంలో పర్యటించారు. నగరపాలక సంస్థ పరధిలోని పద్మనగర్ ప్రాంతంలో మున్సిపల్, మెప్మా సమైక్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాన్ని సందర్శించారు. సప్తగిరికాలనీ, హౌసింగ్‌బోర్డు పార్కులను, ఎస్సారార్ సమీపంలోని రిజర్వాయర్‌ను, డీఆర్‌సీసీ సెంటర్‌ను సందర్శించారు. టవర్‌సర్కిల్, మార్కెట్ ఏరియాలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ వెండర్స్ మేళాలో పాల్గొని వ్యాపారులకు సూచనలు చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం వంద రోజుల కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రజలను భాగస్వాములను చేసి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డీసీ ఖాదర్ మోహియొద్దీన్, డీఈ వెంకటేశ్వర్లు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి పాల్గొన్నారు.

ప్రజావాణికి 304 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

సుభాష్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 304 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సర్దుబాటు జీవోను సవరించాలి'

కరీంనగర్ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే ప్రక్రియను నిలిపివేయాలని ఎస్టీయూ జిల్లాశాఖ ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం నగరంలోని సాధన స్కూల్‌లో ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కట్ట రవీంద్రాచారి మాట్లాడుతూ జీవో 25ని సవరించాలని, ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని, మెరుగైన అభ్యాసన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి గుండ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నింటి తిరుపతిరావు, రాష్ట్ర బాధ్యులు కొట్టె లక్ష్మణరావు, వెలిచాల వెంకటస్వామి, యెనగంటి బాలాజీ, కోట శ్యాంకుమార్, రసూల్, వి రవీందర్, తాటిపాముల శ్రీనివాస్, మధిర వేణుగోపాల్, చొప్పదండి రామకృష్ణ, మానుపాటి బుచ్చయ్య, లక్ష్మణాచారి, కందుకూరి శ్రీనివాస్, కరంవీర్ పాల్గొన్నారు.

నెలంతా రేషన్ పంపిణీ

- మూడు నెలలవి ఒకేసారి..
- ఈ నెల 30 వరకు జూన్, జూలై, ఆగస్టు కోటా
- జిల్లాలో 2,90,402 కార్డులు.. నెలకు 16,748 మెట్రిక్ టన్నుల బియ్యం
- 50,245 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీకి ఏర్పాట్లు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వర్షాకాలం నేపథ్యంలో వరదలు, ఇతర ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం జూన్‌లోనే మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే పంపిణీ ప్రారంభమయింది. ప్రతి నెల 15వ తేదీ వరకు మాత్రమే పంపిణీ చేసే ఆనవాయితీకి భిన్నంగా ఈ నెల 30 వరకు రేషన్ పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు.

వేలిముద్రలు తీసుకోవడంలో సాంకేతిక ఇబ్బందులు

ఒకేసారి మూడు నెలల కోటా పంపిణీ చేసే సమయంలో వేలిముద్రలు తీసుకునే క్రమంలో ఆలస్యమవుతుండడంతో నెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 2,90,402 రేషన్ కార్డులు ఉండగా అందులో 8,79,888 మంది లబ్దిదారులుగా నమోదయ్యారు. వీరందరికి ఒక్కో నెల 16,748 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతాయి. జూన్, జూలై, ఆగస్టు కోటా పంపిణీ చేస్తున్నందున జిల్లా యంత్రాంగం 50,245 మెట్రిక్ టన్నుల బియ్యం అందుబాటులో ఉంచింది. ఆహార భద్రత కార్డులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున మూడు నెలలకు ఉచితంగా బియ్యం అందిస్తున్నారు. అంత్యోదయ కార్డుదారులకు కూడా కార్డుకు నెలకు 35 కిలోల చొప్పున మూడు నెలల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అన్నపూర్ణ కార్డుదారులకు నెలకు 10 కిలోల చొప్పున మూడు నెలలకు 30 కిలోల బియ్యం పంపిణీ జరుగుతున్నది. అంత్యోదయ కార్డుదారులకు నెలకు కిలో చక్కెర చొప్పున మూడు నెలలకు మూడు కిలోలు

మిగతా 8వ పేజీలో



విలీన గ్రామాల్లో విభజన కలకలం

- దుర్శేడ్‌లో కనబడని 933 ఓట్లు
- గుంటూరుపల్లిని బొమ్మకల్‌లో కలపడంపై అభ్యంతరం



దుర్శేడ్ గ్రామ పంచాయతీ కార్యాలయం

కరీంనగర్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో డివిజన్ల పునః విభజన ప్రక్రియ తీవ్ర కలకలం రేపుతోంది. ఇటీవల విడుదల చేసిన డివిజన్ల పునర్విభజన ముసాయిదా జాబితాను అధికారులు తప్పుల తడకగా రూపొందించారనే విమర్శలు వస్తున్నాయి. కరీంనగర్‌ను ఆనుకుని ఉన్న బొమ్మకల్, గుంటూరుపల్లి, గోపాల్‌పూర్, దుర్శేడ్ గ్రామాల డివిజన్లపై ఆయా గ్రామాల ప్రజలతో పాటు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ ముసాయిదా జాబితాలో పేర్కొన్న ఓటర్లకు, ఆయా గ్రామాల్లో ఉన్న ఓటర్ల సంఖ్యకు పొంతన లేదని వారంటున్నారు. దుర్శేడ్ గ్రామ పంచాయతీలో ఉన్న గుంటూరుపల్లెను బొమ్మకల్‌లో కలపడంపై అభ్యంతరం వ్యక్తమవుతోంది. రాజీవ్ రహదారికి ఒక వైపు దుర్శేడ్ ఉండగా మరో వైపు గోపాల్‌పూర్ గ్రామం ఉంది. డివిజన్ల పునర్విభజనలో ఈ రెండు గ్రామాలను కలిపి ఒకే వార్డు ఎలా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుర్శేడ్, గుంటూరుపల్లి రెండు పక్కపక్కనే ఉన్న గ్రామాలను విడదీసి గుంటూరు పల్లెను బొమ్మకల్‌లో, దుర్శేడ్‌ను గోపాల్‌పూర్‌లో ఎందుకు కలపాల్సి వచ్చిందో అధికారులు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ముసాయిదా జాబితాను అధికారులు పునః పరిశీలించి లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు. కరీంనగర్‌లోని పలు డివిజన్లలో కూడా తీవ్రఅభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు అశాస్త్రీయంగా రూపొందించిన ముసాయిదాను క్షేత్రస్థాయిలో పరిశీలించి తప్పులను సవరించి డివిజన్ల విభజన చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫిట్‌గా ఉన్నాయా?

వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోని విద్యా సంస్థలు
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 శాతం వాహనాలకే పరీక్షలు

7



రూ. 2.99 లక్షల కోట్లతో అమృత్-2

- ఇంటింటికి మంచి నీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించడమే లక్ష్యం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



చొప్పదండిలో శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమృత్-2 పథకం కింద దేశవ్యాప్తంగా పట్టణాల్లో నివసించే ప్రజలకు మంచి నీరు అందించేందుకు 2.99 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం చొప్పదండిలోని నల్లాలబావి వద్ద 36.3 కోట్ల వ్యయంతో వాటర్ ఇంప్రూవ్‌మెంట్ స్కీంకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో దూరదృష్టితో నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రతి ఇంటికీ సరిపడా నీటిని అందించే లక్ష్యంతో పథకానికి రూపకల్పన చేశారని అన్నారు. చొప్పదండి మున్సిపాలిటీలో అమృత్-2 పథకం కింద 36.3 కోట్ల రూపాయల నిధులతో పైపులైన్, వాటర్ పంపు, ఇతర పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

చొప్పదండిలో ఈ స్కీం ఎప్పుడో ప్రారంభించాల్సి ఉండగా గత ప్రభుత్వం సహకరించకపోవడం వల్ల జాప్యం జరిగిందన్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి పథకం పనులకు శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందని, వచ్చే ఏడాది చివరి నాటికి ఈ పనులను పూర్తిచేసి చొప్పదండి ప్రజలకు ఇంటింటికీ సరిపడా నీళ్లు అందిస్తామని ఆయన తెలిపారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో స్మార్ట్ సిటీ, అమృత్ నిధులు రావడంతో కరీంనగర్ పార్లమెంట్‌ను అభివృద్ధి చేసుకునే అవకాశం కలిగిందన్నారు. సీఆర్ఐఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్లను నిర్మిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపా రు. 2015 జూన్ 25న ప్రారంభమైన అమృత్-1 పథకం కింద కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద 50 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిందని, అమృత్ స్కీం ద్వారా దేశ వ్యాప్తంగా ఇప్ప టి వరకు 1.34 కోట్ల నీటి కనెక్షన్లను, 1.02 కోట్ల మురుగు నీటి కనెక్షన్లను అందించామన్నారు. 2,411 పార్కులను అభివృద్ధి చేశామని, 62.78 లక్షల ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో అమృత్-1, 2 కింద మొత్తం 6,876 కోట్లు ఖర్చు చేయబోతున్నామని, ఇందులో కేంద్రం వాటా 3,591.72 కోట్లని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అమృత్-1, అమృత్-2 కింద మొత్తం 852.11 కోట్ల రూపాయ లు కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర వాటాగా 481.19 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా 297.55 కోట్లు, మున్సిపాలిటీల వాటా 73.37 కోట్లు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, అధికారులు పాల్గొన్నారు.

వాంతులు, విరేచనాలు అరికట్టడానికి రోటా వ్యాక్సిన్

సుభాష్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో వాంతులు విరేచనాలు అరికట్టడానికే రోటా వ్యాక్సిన్ వేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోటా వ్యాక్సిన్ ప్రారంభానికి సంబంధించిన విధివిధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇదివరకు రోటా వైరస్ సింగిల్ డోస్ వాయల్స్ వచ్చేవని, అవి 6 వారాలు, 10 వారాలు, 14 వారాల వ్యవధితో మూడు డోసులు ఇచ్చేవారని తెలిపారు. ప్రస్తుతం రెండు డోసులు ఉన్న వాయల్ సరఫరా చేస్తున్నారని, ఇదే విధానంలో వ్యాక్సిన్ ఇవ్వాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాజిదా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.



అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్

● ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాలాపూర్ గ్రామశివారు లోని సోమవారం బైపాస్‌రోడ్డులో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్నవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శంకరపట్నం మండలం అంబాలాపూర్ గ్రామానికి చెందిన సముద్రాల మల్లయ్య, ఎండీ రఫీక్ కలిసి బైపాస్ రోడ్డులో అంబాలాపూర్ నుంచి కేశవపట్నం వెళ్తున్నారు. ఈక్రమంలో మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో సముద్రాల మల్లయ్య తలకు బలమైన గాయాలుకాగా, రఫీక్‌కు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108లో క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చోరీకి యత్నం

మంథని, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక నడివీధిలోని గట్టు నందు-పద్మ ఇంట్లో దొంగలు చోరీకోసం ప్రయత్నించినట్లు స్థానికులు సోమవారం ఉదయం గుర్తించారు. ఇంటి యజమాని నందు-పద్మలు రెండు నెలల క్రితం నెదర్లాండ్‌లోని కుమారుడి వద్దకు వెళ్లారు. దీంతో ఇంటికి తాళం వేసి ఉంది. ఈవిషయాన్ని గమనించిన దొంగలు వారి చోరీ కోసం ప్రయత్నించారు. ఇంటికి తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు వారి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాన్ని గడ్డపారతో పగుల గొట్టడానికి దొంగలు ప్రయత్నించారు. అది వీలుక పోవడంతో గడ్డ పారను అక్కడే వదిలివెళ్లినట్లు గుర్తించారు. ఎలాంటి చోరీ జరగలేదని బంధువులు గుర్తించారు.

దొంగలు బాబోయ్..



వరుస చోరీలతో ఆందోళన చెందుతున్న ప్రజలు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

పోలీసులకు సవాలుగా మారిన దొంగతనాలు

గంగాధర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా గంగాధర మండలంలో దొంగలు పెట్రేగి పోతున్నారు. ఎన్నడూ లేని విధంగా వరుస చోరీలు జరుగుతుండగా మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పగలు, రాత్రి గస్తీ కాస్తున్నా.. మండల వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నా.. దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఒకచోరీ కేసు దర్యాప్తులో ఉండగానే మరోగ్రామంలో దొంగతనం జరుగుతోంది. ఎంత నిఘా పెడుతున్న వరుసగా తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి.

గంగాధర మండలంలో 33 గ్రామపంచాయతీలున్నాయి. నిత్యం మండలంలోని ఏదోఒక చోట వాహనాల తనిఖీలు చేపడుతూ పాతనేరస్తులు, అసాంఘిక కార్యాకలాపాలపై ప్రత్యేకనిఘా పెడుతూనే ఉన్నారు. అయినా మండలంలో చోరీలు పోలీసులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. దొంగలు పకడ్బందీగా వారి పని పూర్తి చేసుకుని మూడో కంటికి చిక్కకుండా తప్పించుకుంటున్నారు. పెళ్లిలు, శుభ కార్యాలుండగా ఇంటిల్లిపాది వెళ్లడం చూసి దొంగలు తమ పని సులువుగా కానిచ్చేస్తున్నారు. ఆశ్చర్యమేమంటే లక్ష్మీ దేవిపల్లిలో జరిగిన దొంగతనంలో ఇంట్లో మద్యం సేవించి వస్తువులు అపహరించారు.

సవాలు విసురుతున్న దొంగతనాలు..

గంగాధర మండలం లో జరుగుతున్న చోరీలు పోలీసులకు సవాలు విసురుతున్నాయి. ఇప్పటివరకు జరిగిన దొంగతనాలు మూడు రోజుల వ్యవధిలోనే జరిగాయి. ప్రధానంగా రోడ్డు పక్కన ఇళ్లనే టార్గెట్ చేస్తూ దోపిడీ చేస్తున్నా రు. పోలీసులు తీసుకునే చర్యలతో నేరాలు తగ్గుముఖం పట్టాయని అనుకునే లోపే వరుసచోరీలతో పోలీసులకు సవాలుగా మారుతున్నాయి. గతంలో మండల వ్యాప్తంగా ఆయాగ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటి కాలం చెల్లిపోవడం, మరి కొన్ని చెడిపోవడంతో వాటి నిర్వహణ పట్టిం చుకునే వారు కరువయ్యారు. అదీగా కా గ్రామాల్లో రాత్రుల్లో వీధిదీపాలు వెలగడం లేదు. ప్రజాప్రతినిధులుంటే అప్పులు చేసైనా గ్రామాల్లో వీధిదీపాలు పెట్టేవారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన నడుస్తుండగా ఎవ్వరూ పట్టించుకోక గ్రామాల్లో చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. వీధిదీపాలు లేకపోవడంతో దొంగలకు వారిపని చేసుకోవడానికి మరింత సులువైందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



కొన్ని ఘటనలు

● ఈనెల 3న లక్ష్మీదేవిపల్లిలో రోడ్డుపక్కన రెండు ఇళ్ల తాళం పగులగొట్టి రూ.2లక్షల నగదు, రెండు ఇత్తడిబిందెలు, బియ్యం బస్తాలను ఎత్తుకెళ్లారు

● జూన్ 6న మధురానగర్ వేములవాడ రూట్‌లో వైన్స్‌పర్మిట్ రూం తాళం పగులగొట్టి దొంగతనానికి యత్నించారు.

● జూన్8న వెంకటయ్యపల్లిలో రోడ్డు పక్కన తాళంవేసి ఉన్న ఇంటితాళం పగులగొట్టి బీరువాలోని 33తులాల బంగారం, వెండి, 25వేల నగదును ఎత్తుకెళ్లారు.



చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం..: వంశీకృష్ణ, ఎస్సై, గంగాధర

చోరీకి పాల్పడిన దొంగలను త్వరలోనే పట్టుకుంటాం. ప్రత్యేకబృందాలను ఏర్పాటు చేసి దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే అనుమా నిత వ్యక్తులను విచారిస్తున్నాం. వివాహాలు, శుభకార్యాలకు వెళ్లేవారు తప్పని సరిగా పోలీసులకు సమాచారం అందించాలి. ఇంట్లో విలువైన బంగారు వస్తువులు, నగదును ఉంచుకోరాదు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

● అప్పుల బాధతో ఆత్మహత్య



వంశీ(ఫైల్)

తంగళ్లపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం అప్పులు చేసి తిరిగి చెల్లించ లేక ఓ యువకుడు ఆత్మహత్యకు పల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లె గ్రామానికి చెందిన దంపతులు తుమ్మల మంజుల-శ్రీనివాస్ కుమారుడు తుమ్మల వంశీ(20) మూడు సంవత్సరాల క్రితం ఇంటర్ పూర్తిచేశాడు. కరీంనగర్‌లోని ఓ కారు మెకానిక్ షాప్‌లో పనిచేస్తున్నాడు. మూడు సంవత్సరాలుగా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నాడు. దీంతో సుమారు రూ.10లక్షల వకరు నష్టపోయాడు. అందిన కాడికి అప్పులుచేసి బెట్టింగ్ గేమ్స్ ఆడారు. ఎక్కువగా అప్పులు చేయడంతో తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపం చెందిన వంశీ సోమవారం పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతోనే వంశీ ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గ్రామస్థులు చర్చిం చుకుంటున్నారు.

అప్పులు ఇచ్చిన వారి వేధింపులే ఆత్మహత్యకు కారణమా?

అప్పులు ఇచ్చిన వారినుంచి ఒత్తిడి పెరగడంతోనే వంశీ ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. కరీంనగర్‌లో పనిచేస్తున్న వంశీ మిత్రుడి పెళ్లికి ఆదివారం గ్రామానికి వచ్చాడు. కరీంనగర్‌లో పరిచయమైన వారి వద్ద అప్పులు చేసినట్లు తెలిసింది. ఆదివారం అర్ధరాత్రి దేశాయిపల్లె గ్రామంలో ఉన్న వంశీని కరీంనగర్‌కు చెందినమిత్రులు అప్పు చెల్లించాలని ఒత్తిడి తీసుకురావడంతో మనస్థాపం చెందిన వంశీ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

చొప్పదండి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకుంటకు చెందిన ఎడ్ల తేజసాయిశ్రీ(30) అనే వివాహిత చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఎస్ఐ నరేష్‌రెడ్డి కథనం ప్రకారం.. భర్త జగన్ ముందు రోజు రాత్రి ఇంటికి రాలేదని ఈనెల6న ఎడ్ల సాయిశ్రీ క్షణికావేశంలో క్రిమిసంహారక మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు 108లో చికిత్సనిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా సోమవారం మృతిచెందింది. తహసీల్దార్ నవీన్‌కుమార్ పంచనామా నిర్వహించగా మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రి మందలించాడని యువతి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి



సుప్రియ(ఫైల్)

బీర్‌పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని క్షణికావేశంతో బీర్‌పూర్ గ్రామానికి చెందిన అల్లేపు సుప్రియ(18) అనే యువతి కొద్ది రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందిందని ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. సుప్రియ ఈనెల 6న తన అక్కతో గొడవ పడుతుండగా తండ్రి అశోక్ మందలించాడు. దీంతో క్షణికావేశంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా సుప్రియ చికిత్స అందిస్తుండగా ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి అల్లేపు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అనారోగ్య సమస్యలతో రైతు బలవన్మరణం

కరీంనగర్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లబుత్కూర్ గ్రామానికి చెందిన కూర శ్రీనివాస్ రెడ్డి(40) అనే రైతు అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయంతోపాటు హార్వెస్టర్ నడుపుతూ జీవిస్తున్నాడు. నెలరోజుల క్రితం అకస్మాత్తుగా కిందపడడంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఆపరేషన్‌కు రూ.2లక్షలు అవసరమవగా భూమిని విక్రయించేందుకు వీలుకాలేదు. ఈ క్రమంలో సోమవారం గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

● పాత కక్షలే కారణం
● నిందితుల్లో ఇద్దరు మైనర్లు
● ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం

మల్యాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల రెండున హత్యకు గురి అయిన మల్యాల మండలం కొండగట్టుకు చెందిన ఉప్పు రమణారెడ్డి(29) హత్య కేసులో ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారు. ఈనెల 2న రమణారెడ్డి హత్యకు గురికాగా కేసు వివరాలను జగిత్యాలడీఎస్పీ రఘుచరన్ సోమవారం వెల్లడించారు. కొండగట్టుకు చెందిన ఉప్పు రమణారెడ్డి, బండి సిద్దు అలియాస్ సిద్దార్థ మధ్య కొన్నాళ్లుగా గొడవలు ఉన్నాయి. సిద్దు వివాహం ఈనెల 5న నిశ్చయం కాగా వేడుకల్లో భాగంగా 2వతేదీన ఇంట్లో హల్దీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అక్కడకు రమణారెడ్డి వచ్చి గొడవ చేయడంతోపాటు సిద్దును, అతడి మిత్రులను చంపుతానని బెదిరించాడు. దీంతో అదే రోజు రాత్రి సిద్దు అతని మిత్రులు వేములవాడ మండలం మర్రిపల్లికి చెందిన చింతలకోటి వినయ్, కొండగట్టుకు చెందిన పస్తం ఈశ్వర్‌లు రమణను చంపాలని నిర్ణయించుకున్నారు. కొండగట్టు స్టేజి వద్ద రాత్రి సిద్దు, వినయ్ ఉండగా అక్కడకు రమణారెడ్డి వచ్చాడు. మళ్లీ ఆ ముగ్గురికి గొడవ జరుగగా పంజాల మధు అనే మరో మిత్రుడు గొడవ జరుగుతున్నట్లు ఈశ్వర్‌కు తెలిపాడు. దీంతో అక్కడకు వచ్చిన ఈశ్వర్ వ నాట్లాడు ంకుందా వ ని చెప్పి తనద్విచక్ర వాహనంపై రమణారెడ్డిని కొండగట్టు మెట్ల మార్గం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ సిద్దు, వినయ్, ఈశ్వర్ దాడి చేయడంతోపాటు రమణరెడ్డిని కిందపడేసి బండ రాయితో తలపై కొట్టారు. అనంతరం మరికొందరు మిత్రులు దాసరి ఆకాష్, పంజాల మధు, మంచినీళ్ల అజయ్‌తో పాటు ఇద్దరు మైనర్లు ఘటన స్థలం వద్దకు వచ్చారు. అందరూ కలసి సమీపంలో గల ఉపాధిహామీ కందకాలలో రమణారెడ్డి మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. కాగా నిందితులను సోమవారం అరెస్ట్‌చేసికోర్టులో హాజరుపరచినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ద్విచక్ర వాహనం, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మృతుడు రమణారెడ్డిపై కూడా పలు కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మల్యాల సీఐనీలం రవి,మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి ఎస్సైలు నరేశ్‌కుమార్, సందీప్, రవీందర్‌కుమార్ పాల్గొన్నారు. కాగా ఈకేసులో అరెస్టైన సిద్దుకు ఈనెల5న వివాహం అయింది.



నిందితుల అరెస్టు చూపుతున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

టీపీసీసీలో ఉమ్మడి జిల్లా నేతలకు చోటు

కరీంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులుగా పలువురు ఉమ్మడి జిల్లా నేతలకు చోటు లభించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా రుద్ర సంతోష్‌కుమార్, గజ్జెలకాంతం, రహమత్ హుస్సేన్, దుద్దిళ్ల శ్రీనివాస్, ఈర్ల కొమురయ్య, ఈవీ శ్రీనివాస్‌రావు, కాశిపాక రాజేష్‌ను నియమించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను నియామకం చేశారు.

హత్యాయత్నం కేసులో నలుగురికి జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయంలో సొంత తమ్ముడితోపాటు అతడి బావమరిదిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నలుగురికి రెండేళ్ల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.రాణి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... చొప్పదండి మండలం ఆర్నకొండకు చెందిన ముగ్గురు అన్నదమ్ముల్లో కనకట్ల రమేష్ చిన్నవాడు. రమేష్ కులాంతర వివాహం చేసుకోవడం అతడి అన్నలు కనకట్ల మహేష్, సురేష్‌కు ఇష్టం లేదు. ఉమ్మడి ఆస్తిని రమేష్‌కు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈవిషయమై పంచాయితీ పెట్టగా పెద్ద మనుషులు జరిమానా విధించారు. దీంతో కక్ష పెంచుకున్న తనఅన్న కనకట్ల మహేష్, అతడి స్నేహితుడు దయ్యాల రాజయ్య, అతడికుమారులు దయ్యాల మహేష్, దయ్యాల శేఖర్ 2023 జూన్ 11న రాత్రి తనపై, తన బావమరిది బండారి సతీష్‌పై కత్తులు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని రమేష్ చొప్పదండి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నలుగురిపై కేసునమోదు చేయగా సీఐ రవీందర్ దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం లక్ష్మణ్ కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన జడ్జి నలుగురికి జైలుశిక్ష, జరిమానా విధించారు.



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న సీఐ ప్రవీణ్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్

అంతర్గాం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం అంతర్గాం మండల కేంద్రంలోని ఎరువులు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో మందుల స్టాక్‌ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ప్రభుత్వం నిషేధించిన కలుపు మందు గ్లైఫోసెట్, బీజీ3 విత్తనాలను విక్రయించవద్దని షాప్ యజమానులను ఆదేశించారు. రైతులు విత్తనాలను దళారుల వద్ద కాకుండా లైసెన్స్ కలిగిన షాప్‌ల్లో కొనుగోలు చేసి రశీదులు పొందాలని సూచించారు. ఎస్ఐ వెంకట స్వామి, మండల వ్యవసాయశాఖ అధికారి సతీష్, విస్తరణ అధికారి హరీష్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురిపై అదనపు వరకట్నం కేసు

జమ్మికుంట రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం నాగంపేట గ్రామానికి చెందిన నంగి వనిత తన అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనితకు పదేళ్ల క్రితం పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి శరత్‌కుమార్‌తో ఘనంగా వివాహం జరిపించారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. అప్పటి నుంచి తన భర్త అదనపుకట్నం కావాలంటూ వేధించడం మొదలు పెట్టాడు. అత్త తిరుపతమ్మ, మామ కొంరయ్య, ఆడపడుచులు బైరి సరిత, ఆమె భర్త రవీందర్, జంగిలి సమంత, ఆమె భర్త రాజేశ్వర్ అదనపు తేవాలని వేధిస్తున్నారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో మందుబాబులకు సామాజిక శిక్ష

● ఫైన్‌తోపాటు మొక్కలు నాటించిన న్యాయమూర్తి

కోల్‌సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌లకు పట్టుబడిన 28మంది మందుబాబులకు ఒకటవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ సారిక జరిమానాతోపాటు సామాజిక సేవలో భాగంగా మొక్కలు నాటించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పలువురు మందుబాబులు ఖని వన్‌టౌన్ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని వన్‌టౌన్ కోర్టు డ్యూటీ ఆఫీసర్ అభి సోమవారం ఒకటవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా మందుబాబులకు 24మందికి ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా, మరో నలుగురికి రూ.2500 జరిమానాతోపాటు సామాజిక సేవలో భాగంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటాలని ఆదేశించారు. దీంతో ఫైన్ చెల్లించి, కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు.

ముగ్గురి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముగ్గురు ట్రాక్టర్ డ్రైవర్లను సోమవారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా ఆదివారం ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తుండగా కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి పట్టుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్లు రెడ్డిరామపల్లికి చెందిన ఓర్సు రాజేందర్, ఎలగందల్‌కు చెందిన కిన్నెర చిరంజీవి, బావుపేటకు చెందిన ఆలకుంట స్వామిని సోమవారం కొత్తపల్లి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు, లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదు

● ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో కాంగ్రెస్ జోక్యం తగదు

● చిగురుమామిడి ఎంపీడీవో కార్యాలయం ముట్టడికి సీపీఐ నాయకుల యత్నం ● అరెస్టు చేసిన పోలీసులు

చిగురుమామిడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక, రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీడీవోపై జిల్లాస్థాయి అధికారులు సమగ్రవిచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లాకార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయం ముట్టడికి యత్నిస్తే పోలీసులు అరెస్టు చేయడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్రప్రభుత్వం సంక్షేమపథకాలను పేదలకు అందించే క్రమంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో జిల్లా వ్యాప్తంగా అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. చిగురుమామిడి మండలంలో పూర్తిగా అధికారపార్టీ కాంగ్రెస్ కనుసన్నల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరగడంతో అర్హులైన వారికి తీవ్రఅన్యాయం జరుగుతోందన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేయాల్సిన చిగురుమామిడి ఎంపీడీవో తన చాంబర్‌లో అర్ధరాత్రి వరకు కాంగ్రెస్ నాయకులను కూర్చో బెట్టుకుని లబ్ధిదారులను ఎంపిక చేయడం వివాదస్పదమైందన్నారు. ఎంపీడీవోస్థాయి అధికారి ఓ కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, బోయిన అశోక్, గూడెం లక్ష్మీ, మండలకార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతాల శ్రీనివాస్, అందె చిన్నస్వామి, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, బామండ్ల పల్లి యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుతున్న సీపీఐ నాయకులు

చోరీ ఘటనపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న కందాల మంజుల ఇంటిలో జరిగిన చోరీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ సోమవారం తెలిపారు. గ్రామంలోని మద్దుల శ్రీపాల్‌రెడ్డి ఇంటిలో కందాల మంజుల అద్దెకు ఉంటున్నది. కందాల మంజుల ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా ఇంటి తాళాలు పగులకొట్టి ఉన్నాయని ఈ నెల 3న శ్రీపాల్‌రెడ్డి ఆమెకు సమాచారం అందించారు. మరుసటి రోజు ఎల్లారెడ్డిపేటకు చేరుకుని పరిశీలించడంతో ఇంటిలోని బీరువాను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని ఉత్సవమూర్తులకు సంబంధించిన అమ్మవారి బంగారు వడ్డాణం, కిరీటాలు, పుస్తెలు, ముక్కుపుడక, వెండి మంగళహారతులు, కుంకుమ భరిణి, మాణిక్యాలను అపహరించుకుపోయారని తెలిపారు. బాధితురాలు మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

సిరిసిల్ల పాతబస్టాండ్‌లో గుర్తు తెలియని మృతదేహం

● గుర్తించిన వారు సమాచారం ఇవ్వాలని తెలిపిన పోలీసులు



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సిరిసిల్ల రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్ గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం ఉదయం పోలీసులు స్వాధీనం చేసుకుని జిల్లా ఆసుపత్రిలోని పోస్ట్‌మార్టం రూంలో భద్రపరిచినట్లు మృతదేహాన్ని గుర్తించి వారి కుటుంబీకులతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ కోరారు. పాత బస్టాండ్ ప్రాంతంలోని సులభ్ కాంప్లెక్స్ ప్రాంతంలో సుమారు 45నుంచి 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడని ప్రజలు సమాచారం ఇచ్చారని తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని పోస్ట్‌మార్టం రూంకు తరలించామని మృతుడి ఒంటిపై ఎరుపు, నల్లరంగులతో కూడిన టీషర్ట్‌తో పాటు నలుపు రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. 5.6 ఫీట్స్ ఎత్తు ఉంటాడని తెలిపారు. మృతదేహాన్ని గుర్తించి 8712656366, 8712656367లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఫిర్యాదుదారు వద్దకే న్యాయమూర్తి

● పక్షవాతంతో బాధపడుతుండగా కోర్టు ఆవరణలో విచారణ

మెట్‌పల్లిటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో బాధపడుతున్న మహిళా ఫిర్యాదుదారు చల్ల రమక్క మెట్‌పల్లి ఓపెన్ కోర్టు హాల్‌లోకి రాలేకపోవడంతో న్యాయమూర్తి నారం అరుణ్ కుమార్ బయటికి వచ్చి సోమవారం విచారణ చేపట్టారు. ఇబ్రహీంపట్నం పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం ఈనెల 14న జరగనున్న లోక్ అదాలత్‌లో భాగంగా రాజీకేసుల విచారణ ప్రారంభమైంది. తనపై దాడి చేశారని ఇబ్రహీంపట్నం మండలం గోధుర్ గ్రామానికి చెందిన చల్ల రమక్క, అదే గ్రామానికి చెందిన చల్ల మల్లేష్, చల్ల శంకర్‌లపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వారిద్దరిపై ఎస్సై సెక్షన్ 329(4), 292,118(1)ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి మెట్‌పల్లి కోర్టుకు ఛార్జిషీట్ పంపించారు. అనంతరం కోర్టు నిందితులకు అప్పియరెన్స్ నోటీసులు పంపించింది.

నిందితులు, ఫిర్యాదుదారు కలసి కేసు రాజీచేసుకుని సోమవారం కోర్టుకు వచ్చారు. ఫిర్యాదుదారు పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ ఓపెన్ కోర్టులోని విచారణ కేసుల్ని పక్కన పెట్టి ఆటోలో వచ్చిన చల్ల రమక్క వద్ద వివరాలు నమోదు చేసుకుని మల్లేష్, శంకర్‌లపై ఉన్న కేసును కొట్టివేస్తున్నట్టు ప్రకటించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కోనరావుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన రైతు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులకథనం ప్రకారం.. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన అన్నవేణి తిరుపతి (36) అనే రైతు తన తల్లిదండ్రుల పేరుమీద ఉన్న నాలుగు ఎకరాల భూమి సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతంలో ఒక వ్యవసాయ బావినికూడా తవ్వించాడు. వ్యవసాయంలో దిగుబడి రాక అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చడానికి మరింత అప్పు చేసి గల్ఫ్ దేశమైన మలేషియా వెళ్లాడు. అక్కడ కూడా పరిస్థితులు అనుకూలించకపోవడంతో తిరిగిస్వగ్రామానికి చేరుకున్నాడు. అప్పటి నుంచి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చేసిన అప్పులు తీర్చకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. అప్పులు ఎలాతీర్చాలో తెలియక మనోవేదన గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి ఈనెల 5వ తేదీన తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి తల్లి లక్ష్మి, భార్య లతిక, కూతురు హర్షిని, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

ధర్మపురి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ధర్మపురి మండలం రాజారంకు చెందిన బొల్లి పెద్దలింగం(54) అనేవ్యక్తి ఆత్మహత్యాయత్నం చేయగా సోమవారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అనారోగ్యం భరించలేక ఆదివారంరాత్రి ఇంటి బయట క్రిమిసంహారక మందు తాగాడు. అనంతరం ఆయన భార్యకు విషయం చెప్పడంతో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేటి నుంచి రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్లో ప్రవేశాలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల10,11తేదీల్లో హనుమకొండ జేఎన్ క్రీడామైదానంలో అండర్-10, 12, 14, 16 బాలబాలికలు అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ లాంటి 5క్రీడాంశాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. అండర్-10, 12 బాలబాలికలకు అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తారు. 30 జూన్ 2013 నుంచి 1 జూలై 2015 మధ్య జన్మించిన వారు అర్హులు. అండర్-14, 16 బాలుర విభాగంలో రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. 30జూన్ 2009 నుంచి 1జూలై 2011 మధ్య జన్మించిన వారు అర్హులు. ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగుపందెం, 6, 10 మీటర్ల షటిల్‌రన్, మెడిసిన్‌బాల్‌త్రో, వర్టికల్‌జంప్, ఫెక్సిబిలిటీ టెస్ట్, మెడికల్ టెస్ట్‌లను హనుమకొండ జేఎన్‌ఎస్‌లో నిర్వహిస్తారు. రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశాల ఎంపిక పోటీల్లో పాల్గొనే బాల బాలికలు వారి జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి జారీ చేసిన బోనఫైడ్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, 10 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు వెంట తీసుకు రావాలి. 10న హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని డీఎస్‌ఏ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు హాజరు కావాల్సి ఉంటుంది.



ఫిట్‌గా ఉన్నాయా?


విరిగిన బస్సు ఫుట్‌బోర్డు

- వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోని విద్యా సంస్థలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 శాతం వాహనాలకే పరీక్షలు
- 15 సంవత్సరాలు దాటిన బస్సులు 324

తిమ్మాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మరో వారం రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సంబంధిత సంస్థల యజమానులు వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. ఇప్పటికి 50 శాతం బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నాయి. మే 15 నాటికి వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ముగిసింది. నిబంధనల మేరకు ఆ లోపు రెన్యూవల్ చేయించుకోవాలి.


బస్సు కండీషన్‌ను పరిశీలిస్తున్న డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి

విద్యా సంస్థల వాహనాలు పాటించాల్సిన నిబంధనలు

1. విద్యా సంస్థ పేరు, ఫోన్ నంబర్లు, చిరునామా బస్సు ఎడమ వైపున, ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి.
2. ప్రతి వాహనంలో అత్యవసర ద్వారం ఉండాలి. దానిపై స్పష్టంగా కనిపించేలా అత్యవసరద్వారం అని రాయించాలి.
3. ప్రతి బస్సులో అవసరమైన మందులు, పరికరాలతో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను అందుబాటులో ఉంచాలి.
4. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల వివరాలతో కూడిన పట్టికను ఏర్పాటు చేయాలి.
5. విద్యార్థులు బస్సులోకి ఎక్కడం, దిగడం సరిగ్గా స్పష్టంగా కనిపించేందుకు కన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలు అమర్చాలి.
6. బస్సు ఇంజన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక పరికరం ఉంచాలి.
7. వాహనాల తలుపులకు సురక్షిత లాకింగ్ సిస్టమ్ అమర్చాలి.
8. వాహనంలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకు వెళ్లవద్దు.
9. బస్సులో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా మెట్లకు రెయిలింగ్ ఏర్పాటు చేయాలి.
10. డ్రైవర్ల వయస్సు 60 సంవత్సరాలకు మించి ఉండవద్దు.
11. ప్రతి వాహనంలో ఒక సహాయకుడు ఉండాలి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల వాహనాల వివరాలు

జిల్లా	వాహనాలు	ఫిట్‌నెస్ అయినవి	ఫిట్‌నెస్ కానివి	15 ఏళ్లు దాటినవి
కరీంనగర్	1123	508	320	295
పెద్దపల్లి	274	130	125	19
జగిత్యాల	519	303	171	45
రాజన్న సిరిసిల్ల	167	92	70	05
మొత్తం	2083	1033	686	364


బస్సులను తనిఖీ చేస్తున్న ఏఎంవీఐ ప్రవంతి

నిబంధనలు పాటించని వాహనాలను తిప్పి పంపుతున్నాం: శ్రీకాంత్ చక్రవర్తి, డీటీవో



జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి ఫిట్‌నెస్ చేయించుకునేందుకు వస్తున్న విద్యా సంస్థల వాహనాలకు తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనాలకు విరుద్ధంగా ఉంటే వాటిని సరి చేసుకొని రావాలని తిప్పి పంపుతున్నాం. నిబంధనల మేరకు విద్యా సంస్థల యాజమాన్యాలు తమ వాహనాలను ఫిట్‌నెస్ పరీక్షలకు తీసుకురావాలి.

విద్యా సంస్థల వాహనాలపై ప్రత్యేక తనిఖీలు
పి పురుషోత్తం, డీటీసీ



విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యా సంస్థల యాజమా న్యాలు వాహనాలు ఫిట్‌నెస్ కచ్చితంగా చేయించుకోవాలి. విద్యా సంస్థలు ప్రారంభమైనా తరువాత రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపడతాం. ఫిట్‌నెస్ లేని వాహనాలను పట్టుబడితే విద్యా సంస్థల యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి సీజ్ చేసి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రులు వాహనాల కండిషన్‌ను పరిశీలిస్తూ ఉండాలి. ఏమైనా ఇబ్బంది ఉంటే విద్యా సంస్థల యాజమాన్యానికి, రవాణా శాఖ అధికారులకు సమాచారం అందించాలి. ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. 15 సంవత్స రాలు నిండిన బస్సులను బయట తిప్పవద్దు.

ప్రముఖ వైద్యుడు భూంరెడ్డి మృతి

- ప్రముఖుల సంతాపం
- నేడు అంత్యక్రియలు

కరీంనగర్ అర్బన్/భగత్‌నగర్/ సుభాష్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు వి.భూంరెడ్డి(92) సోమవారం సాయంత్రం 4గంటలకు తుదిశ్వాస విడిచారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని దొమకొండ మండలం జంగపల్లి గ్రామంలో 1934జూలై 9న ఆయన జన్మించారు. అక్కడే పదోతరగతి వరకు విద్యనభ్యసించారు. హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో ఇంటర్మీడియెట్, ఉస్మానియా వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. ఢిల్లీలోని ఆల్‌ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఏయిమ్స్)లో ఎంఎస్ పూర్తిచేశారు. అదే సమయంలో ఉత్తమ విద్యార్థి(డాక్టర్)గా నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అంతేకాకుండా నెహ్రూకు వైద్యసేవలు అందించారు. 1969లో కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జనరల్ సర్జన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎన్నో వేలమందికి ఆయన వైద్యం అందించారు. భూంరెడ్డికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. వారిలో కుమారుడు, ఒక కుమార్తె డాక్టర్లు. ఒక కుమార్తె అమెరికాలోనూ, మరో కుమార్తె హైదరాబాద్‌లోనూ స్థిరపడ్డారు. ఆయన వైద్యంతోపాటు సాహిత్యాభిమాని. గతంలో ఒక సంవత్సరం సినారే పురస్కార ప్రదాతగా వ్యవహరించారు. అనేక ఆధ్యాత్మిక సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తనదైన శైలిలో చలోక్తులు విసిరేవారు.

నేడు అంత్యక్రియలు..

●నగరంలోని సప్తగిరికాలనీ శ్మశానవాటికలో మంగళవారం భూంరెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆయన స్వగృహం నుంచి అంతిమ యాత్ర బయలుదేరుతుందని పేర్కొన్నారు.


డాక్టర్ భూంరెడ్డి(ఫైల్)

డాక్టర్ భూంరెడ్డి సేవలు మరువలేం ..

డాక్టర్ భూంరెడ్డి మృతిపై కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఒకప్రకటనలో సంతాపం ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లోనే వైద్య రంగంలో డాక్టర్ భూంరెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

భూంరెడ్డి మరణవార్త కలిచివేసింది..

సీనియర్ వైద్యుడు భూంరెడ్డి మరణవార్త కలిచివేసిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూంరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్య వృత్తిలో పేరుగాంచిన భూంరెడ్డి దూరమవడం బాధాకరమని తెలిపారు. ఆయన కుటుంబానికి భగవంతుడు అండగా ధైర్యం ఇవ్వాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

బాధాకరం..

డాక్టర్ భూంరెడ్డి మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఉత్తరతెలంగాణ జిల్లాల్లో మొట్టమొదటిసర్జన్‌గా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారన్నారు. భూంరెడ్డి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

● పలువురి నివాళి..

చల్మెడమెడికల్‌కాలేజీ చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహరావు, ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్, డాక్టర్ ఎడవల్లి విజేందర్‌రెడ్డి తదితరులు భూంరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కరీంనగర్ ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ రఘురామన్, సమైక్య సాహితీ డాక్టర్ కిషన్, అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్, ఉదయ సాహితి తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి, స్వేచ్ఛకవి సుదర్శనం వేణుశ్రీ, జిల్లా సాహితి సంస్థల సమాఖ్య అధ్యక్షుడు నంది శ్రీనివాస్ సంతాపాన్ని తెలిపారు.

సుడా చైర్మన్ సంతాపం: సీనియర్ డాక్టర్ భూమ్‌రెడ్డి మృతిపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆస్పత్రి ద్వారా భూంరెడ్డి లక్షలాది మందికి వైద్య సేవలు అందించారని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

- ప్రయాణికులకు సౌకర్యాల కల్పనలో ముందంజ
- కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమాన్


అరుణాచలం బస్సును ప్రారంభిస్తున్న ఈడీ సోలమాన్

కళ్యాణ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవద్దని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమాన్ అన్నారు. సోమవారం గోదావరిఖని బస్టాండ్ నుంచి తమిళనాడు రాష్ట్రం అరుణాచలం ఆలయానికి ఏర్పాటు చేసిన రాజధాని ఏసీ సర్వీస్‌ను కరీంనగర్ రీజినల్ మేనేజర్ రాజుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మౌలిక వసతులను కల్పిస్తున్నామని, కరీంనగర్ రీజియన్‌లోని బస్‌స్టేషన్ల అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టినట్టు తెలిపారు. ఈబస్సు మంగళవారం రాత్రికి అరుణాచలం చేరుకుంటుందని, మహాలక్ష్మి పథకంలో ఈ ఎక్స్‌ప్రెస్‌లను కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనంతరం గోదావరిఖని డిపోలో టిన్-20 సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గోదావరిఖని డిపో అభివృద్ధికి సిబ్బంది నుంచి సలహాలను స్వీకరించారు. బస్టాండ్‌లను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం అందించాలని కోరారు. డిపో ఆవరణలో ఈడీ సోలమాన్, రీజినల్‌మేనేజర్ రాజు మొక్కలను నాటారు. డిపో మేనేజర్ నాగభూషణం, అసిస్టెంట్‌మేనేజర్(ట్రాఫిక్) గీతకృష్ణ, స్టేషన్‌మేనేజర్ అమృత్, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకరయ్య, అకౌంట్స్ సూపరింటెండెంట్ సదానందంతోపాటు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యవసాయ అవసరాలకే కోడెలను వినియోగించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- గోశాలలోని 200 కోడెలను రైతులకు పంపిణీ


రైతులకు రాజన్న కోడెలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

వేములవాడ కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలలోని కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా సూచించారు. తిప్పాపూర్ గోశాలలో సాయంత్రం దరఖాస్తు చేసుకున్న రైతులకు 100 జతల కోడెలను (200కోడెలు)ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కోడెల స్థితిగతులపై ఆరా తీస్తారని తెలిపారు. కోడెలను పొందిన రైతులు వాటి సంరక్షణ బాధ్యతను పక్కాగా చూడాలని సూచించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, పశువైద్యాధికారి, రైతులు తదితరులు ఉన్నారు.

మీ సేవ కేంద్రాలను తనిఖీ చేసిన ఈడీఎం

రామగిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీ సేవ కేంద్రాలను ఈడిఎం కవిత, టిఏస్ మేనేజర్ సాగర్‌లు సోమవారం తనిఖీ చేపట్టారు. పౌరులకు అందుతున్న మీ సేవల కేంద్రాలలోని రికార్డులను పరిశీలించారు. ఆకాడమిక్ సంవత్సరానికి ప్రారంభం అవుతున్న సందర్భంగా సర్టిఫికెట్ల జారీలో జాప్యంలేకుండా సేవలనుఅందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన సేవ చార్జీలు మాత్రమే స్వీకరించాలని ఆదేశించారు. అధిక చార్జీలు వసూళ్ళు చేసినట్లైయితే సెంటర్‌లపై కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని హెచ్చరించారు.


మీ సేవ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఈడీఎం

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

- 90వేల మంది భక్తుల రాక
- దర్శనానికి ఐదు గంటల సమయం
- క్యూలైన్‌లో అపరిశుభ్రతతో ఇబ్బందులు పడిన భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. విద్యార్థులకు వేసవిసెలవులు ముగు స్తుండటంతో సోమవారం రాజన్న ఆలయానికి సుమారుగా 90వేల మంది భక్తులు తరలివచ్చినట్లు ఆలయఅధికారులు అంచనావేశారు. భారీగా తరలివచ్చిన భక్తుల వాహనాలతో గుడిచెరువు పార్కింగ్‌స్థలం నిండిపోయింది. రాజన్నఆలయ ముందుభాగంతో పాటుగా ఆవరణ, ప్రాంగణం, క్యూలైన్‌లో భక్తులతో కిక్కిరిసి కనిపించాయి. భక్తులు ఉదయాన్నేస్వామి వారి ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. పెద్ద సంఖ్యలతో తరలివచ్చిన భక్తులతో ఆలయ ధర్మగుండం, కల్యాణకట్ట భక్తులతో సందడిగా మారింది. ధర్మదర్శనం, కోడెమొక్కు, క్యూలైన్‌లోని భక్తులు సుమారుగా ఐదు గంటలపాటు నిరీక్షించారు. ధర్మదర్శనం, కోడెమొక్కు, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు లక్ష్మీగణపతిని, రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకుని తరించారు.

భక్తుల ఇబ్బందులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం కురిసిన వర్షానికి క్యూలైన్‌లోకి వర్షం నీరు రావడంతో చెత్త చెదారంతో నిండి కనిపించాయి. క్యూలైన్‌లో సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో క్యూలైన్‌ల తీరును చూసి భక్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన సౌకర్యాలు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని భక్తులు విమర్శిస్తున్నారు. రాజన్న ఆలయానికి రోజు రోజుకు భక్తులసంఖ్య పెరుగుతుండటంతో అధికారుల పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉందని భక్తులు చర్చించుకుంటున్నారు.


భక్తులతో కిక్కిరిసిపోయిన రాజన్న ఆలయ ఆవరణ


క్యూలైన్‌లో మురుగు నీరు

ఆర్టిజన్ కన్వర్షన్ చేయకుంటే ఉద్యమం

- టీవీఏసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్ రావు, కన్వీనర్ వజీర్


సమావేశంలో మాట్లాడుతున్న టీవీఏసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్ రావు

పెద్దపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆర్టిజన్లను తక్షణమే కన్వర్షన్ చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తప్పదని టీవీఏసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్ రావు, కన్వీనర్ వజీర్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం టీవీఏసీజిల్లా జేఏసీ కోచైర్మన్ దుర్గం విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన ఆర్టిజన్ కార్మికుల సన్నాహక సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఆర్టిజన్ కార్మికులందరం ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు పిలుపునిస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జిల్లా జేఏసీ కార్యవర్గం తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా 20 వేల మంది ఆర్టిజన్లు కుటుంబాలతో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో ప్రతిఒక్క కార్మికుడికి జేఏసీ రాష్ట్ర నాయకత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. జేఏసీ చేస్తున్న ఉద్యమంపై కుట్రలు చేస్తున్న కొందరు యూనియన్ నాయకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 వేల మంది ఆర్టిజన్లను కన్వర్షన్ చేయడం వలన ప్రభుత్వంపై భారమేమి పడదని, కన్వర్షన్‌ను అమలు చేసిన తర్వాతే జూనియర్ లైన్‌మెన్, సబ్ ఇంజనీర్లు, ఆఫీస్ సబార్డినేట్, తదితర పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఒకే సంస్థలో రెండు రకాల రూల్స్ ఉండడం సరికాదన్నారు. విద్యుత్ వినియోగదారుల సంఖ్య లక్షల్లో పెరిగిందని తెలిపారు. డీటీఆర్, పీటీఆర్ సంఖ్య వేలలో పెరిగాయని, ట్రాన్స్‌కో, డిస్కంలో వేల కిలోమీటర్ల దూరం లైన్స్ పెరిగాయని, ఉద్యోగుల సంఖ్య పెరగలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి 20 వేల ఆర్టిజన్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేందర్, రఘునాథ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సిఐటియు నాయకులు నాగు నాయక్, జిల్లా జేఏసీ కన్వీనర్ మట్ట రాజు, నాయకులు ఎస్ రవి, సందీప్, ప్రభాకర్, ఏ రవి, స్వప్న, జి కిరణ్, బి శ్రీనివాస్, లక్ష్మణ్, సుమన్, సత్యనారాయణ, ఆర్ శ్రీనివాస్, కుమార్, సదయ్య, రమేష్, సాగర్, అంజి, అంజద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు దామెర అశోకొరెడ్డి

భగత్‌నగర్/చొప్పదండి జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం మండలంలోని చాకుంటలో నిర్వహించిన బడిబాటలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వపాఠశాలల బలోపేతమే ప్రాధాన్య అంశంగా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామన్నారు. ఎంఈవో మోహన్, ప్రధానోపాధ్యాయుడు దామెర అశోకొరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు బంగారు భవిత అందుతుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంట శాంతినగర్‌లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. డీఈవో మొండయ్య, ఎంఈవో ఆనందం, ప్రధానపాధ్యాయులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ కరీంనగర్ మండలం మందులపల్లిలో మూతపడిన పాఠశాలను ఎంఈవో రవీందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్, సీఆర్‌పీ రవి చంద్ర పరిశీలించారు. తీగలగుట్టపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కరుణ, ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్, ముత్తారం, మొలంగూర్, చింతలపల్లిలో ఉపాధ్యాయులు టీఎస్‌యూటీఎఫ్ నాయకుడు శ్రీనివాస్ రావు దేశముఖ్ కల్పించిన డీజేతో ఇటింటి ప్రచారం నిర్వహించారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో విద్యావాహిని ప్రచార రథాన్ని ఎంఈవో రాములు ప్రారంభించారు.

మానకొండూర్: మానకొండూర్‌లోని ప్రాథమికపాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేతిరి జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

చిగురుమామిడి: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం బడిబాట నిర్వహించినట్లు మండల విద్యాధికారి పావని తెలిపారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట, తిర్మలాపూర్, కొల్లూరుపల్లి గ్రామాల్లో ఎంఈవో వేణుకుమార్ బడిబట నిర్వహించారు.

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్, వీణవంక, కనపర్తిలో ఎంఈవో శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లిలో హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించారు.

కరీంనగర్ టౌన్: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లాశాఖ ఆధ్వర్యంలో నగరంలో బడిబాట ర్యాలీని నిర్వహించారు. టీఆర్‌టీఎఫ్ నాయకులు కటకం రమేష్, ఖాజా మంజూర్ అలీ, చింతపల్లి అశోక్‌రావు, సుంకిశాల ప్రభాకర్‌రావు, ఖయ్యూం, దయాకర్, రమణారావు, మహేందర్ రాజు, సత్యనారాయణ రాజు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



చింతకుంటలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

నెలంతా రేషన్ పంపిణీ

(5వ పేజీ తరువాయి)

కిలోకు 13.5 రూపాయల చొప్పున చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో 2,74,660 ఆహార భద్రత కార్డులు, 15,707 అంత్యోదయ ఆహార భద్రత కార్డులు, 38 అన్నపూర్ణ రేషన్ కార్డులు ఉన్నాయి. వీరందరికి బియ్యం సరఫరా జరుగుతున్నది. వర్షాకాలం నేపథ్యంలో మూడు నెలల రేషన్ కోటాను జూన్ మాసంలోనే ఇస్తున్నామని, ఈ నెలాఖరు వరకు బియ్యం పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని, ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు.

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరం

భగత్‌నగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. వేసవి సెలవులను వృథాచేయకుండా శిక్షణ శిబిరాలకు సద్వినియోగం చేసుకోవడం మంచి పరిణామమన్నారు. ఎంఈవో ఆనందం, ప్రధానోపాధ్యాయిని శోభారాణి, ఫిజికల్ డైరెక్టర్ అంతడుపుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మోహనచారి

పీఈటీ ముఫాజిల్‌కు అభినందనలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన పీఈటీ మహమ్మద్ ముఫాజిల్ అహ్మద్ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ముఫాజిల్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జెనెక్స్ట్ ఉన్నత పాఠశాలలో 12 ఏళ్లుగా పనిచేస్తూ విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలతోపాటు ఏషియన్ క్రీడల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్నారు.



అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

హోంగార్డుకు వీడ్కోలు సన్మానం

కరీంనగర్ క్రైం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గంగాధర పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు నర్సయ్య సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కేంద్రంలో నర్సయ్యను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సన్మానించారు. అడిషనల్ డీసీపీ వెంకటనమణ, ఆర్ఐ మోడెం సురేష్, హెడ్‌కానిస్టేబుల్ లచ్చయ్య పాల్గొన్నారు.

గ్లోబల్ యూత్ సమ్మిట్-2025లో వివేకానంద ఎన్ఎస్ఎస్ వలంటీర్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ గట్టు జీవా ఏంజెల్ ఈ నెల 4, 5, 6 తేదీల్లో కర్ణాటకలోని మంగుళూరు ఎనిపోయా యూనివర్సిటీలో నిర్వహించిన గ్లోబల్ యూత్ సమ్మిట్-2025లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం కార్యక్రమంలో విద్యార్థిని జీవా ఏంజెల్‌ను కళాశాల కరస్పాండెంట్ ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బైరం మహేష్, ఏసీవో సంపత్ కుమార్, ఏవో బి శ్రవణ్ కుమార్ అభినందించారు.

సామాజిక సమతుల్యత పాటించలేదు

కరీంనగర్ అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణలో సామాజిక సమతుల్యత పాటించలేదని టీఎన్‌జీవో కేంద్ర సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి హమీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం సామాజిక వర్గం రెండు పర్యాయాలు బీఆర్ఎస్‌కు పూర్తి మద్దతు తెలిపినా గుర్తింపు దొరకలేదని, ఈసారి కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిస్తే మంత్రి పదవి ఇవ్వకుండా మోసం చేసిందని అన్నారు. తక్షణమే ముస్లిం సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ శిక్షణ'

కరీంనగర్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):కరీంనగర్ మండలం నగునూర్, మొగ్దుంపూర్‌లో సోమవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ రైతులకు పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. భారతీయ వరి పరిశోధన విభాగం నుంచి డాక్టర్ శ్రీధర్, కేవీకే నుంచి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండల పరిషత్‌లో గ్రామ కార్యదర్శులకు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఓరియేంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఏపీవో శోభరాణి పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: కరీంనగర్ నగరపాలక సంస్థలో ఎస్టీలకు ఐదు డివిజన్లను కేటాయించాలని ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ కోరారు. సోమవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని ఐటీ టవర్‌లోని టెక్‌ఈజీని సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ సాయిరాజ్ హుస్నాబాద్‌కు చెందిన బీటెక్ విద్యార్థిని పిట్టల సుష్మితకు సోమవారం ల్యాప్‌ట్యాప్ అందజేశారు. ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న సంస్థ సీఈవో శ్యాం సుందర్ ల్యాప్‌టాప్ ఇవ్వాలని నిర్ణయించారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని పలు వైష్ణవాలయాల్లో సోమవారం 12 మంది ఆళ్వారులలో ఒకరైన నమ్మాళ్వార్ తిరు నక్షత్రోత్సవాన్ని నిర్వహించారు.

కరీంనగర్ కల్చరల్: భగత్‌నగర్ అంజనాద్రి క్షేత్రంలో వెలసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 32వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నారు.

కరీంనగర్ కల్చరల్: టీటీడీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్మించతలపెట్టిన వేంకటేశ్వరస్వామి దేవాలయ పనులను వెంటనే ప్రారంభించాలని గీతా భక్త సమాజం ప్రధాన కార్యదర్శి వుప్పల రామేశం ట్విట్టర్ ద్వారా తిరుమల ఆలయ చైర్మన్, ఈవోకు సమాచారం అందించారు.

కరీంనగర్ కల్చరల్: వేములవాడకు చెందిన లాలా లింగమూర్తి విడాకులకు వ్యతిరేకంగా రచించిన 'మళ్లీ పెళ్లి కథలు' అనే పుస్తకం 41 సెట్లను వేములవాడకు చెందిన రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు నూగుల అన్నయ్య రచించిన 'శబరిగిరి నివాస' శతకం 5 సెట్లను సోమవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం ద్వారా గ్రంథాలయానికి అందజేశారు.

తప్పుల తడకగా వార్డుల విభజన

కరీంనగర్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగర పాలక సంస్థ అధికారులు దుర్శేడ్ గ్రామాన్ని వార్డుల విభజనలో తప్పుల తడకగా రూపొందించారని, వెంటనే మార్పులు చేసి న్యాయం చేయాలని కోరుతూ మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గృహ నంబర్లు 5-1 నుంచి 5-20 వరకు మాత్రమే రూపొందించారని, రెవెన్యూ రికార్డుల ప్రకారం దుర్శేడ్ పరిధిలో 5-1 నుంచి 5-78బై1 వరకు గృహాలు ఏ డివజన్‌లో చేర్చారనే విషయంపై స్పష్టత లేక ప్రజలు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. దుర్శేడ్-గోపాల్‌పూర్ పోలింగ్ స్టేషన్‌లు 104 నుంచి 111 వరకు కలిపి చూసినప్పుడు డివిజన్ 3లో ఓటర్ల సంఖ్య 5970గా ఉండాలని, మున్సిపల్ నోటిఫికేషన్‌లో 937 ఓటర్ల సమాచారం స్పష్టంగా లేదని తెలిపారు. దుర్శేడ్- గోపాల్‌పూర్ భౌగోళిక విభజనను పునఃసమీక్షించి తగిన మార్పులు చేయాలన్నారు.

అనుమతి లేని స్కూల్‌ను మూసివేయాలి

కరీంనగర్ క్రైం/ భగత్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనుమతి లేని ఎలైట్ వరల్డ్ స్కూల్‌ను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో వరల్డ్, స్మార్ట్, ఈ టెక్నో, ఒలంపియాడ్ వంటి పేర్లు పెట్టుకొని అడ్మిషన్లు చేయరాదన్నారు. కేంద్ర మంత్రి అనుమతి లేని పాఠశాలను ప్రారంభించి తల్లిదండ్రులకు ఎలాంటి సంకేతాలు తెలియజేస్తున్నారని ప్రశ్నించారు.

లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం

సుభాష్‌నగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో మాదిగలకు అన్యాయం జరిగిందని జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామస్థులు ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో అనర్హులను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేవారని ఆరోపించారు. గ్రామసభ లేకుండానే కమిటీ సభ్యులు వారికి ఆర్థికంగా అనుకూలంగా ఉన్నవారిని, బంధువులను ఎంపిక చేశారని ఆరోపించారు. కమిటీలో ఎస్సీ మాదిగలకు స్థానం కల్పించలేదన్నారు. గ్రామ కమిటీ సభ్యులు కార్యదర్శి, ఎంపీడీవో సమక్షంలో ఎంపిక చేయాలని కోరారు.

సమాజ సేవకులకు నంది అవార్డులు



అవార్డులు అందుకున్న జిల్లావాసులు

కరీంనగర్ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్, శ్రీప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలో రాణిస్తున్నవారిని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ బంగారు నంది అవార్డులతో సన్మానించారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఇంజనీర్లు ఈద కుమార స్వామి, కోల అన్నారెడ్డికి మాజీ మంత్రి, సినీనటుడు బాబు మోహన్, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, డైవిజ్ఞ , మల్కాజ్‌గిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, సినీ ప్రముఖులు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారిని అలయన్స్ ప్రతినిధులు పులాల శ్యామ్, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, హైమావతి మహేష్, అల్లాడి ఆనంద్‌కుమార్, సుద్దపల్లి ప్రసాద్, వైద్యులు వసంతరావు, రాజ్ కుమార్, పెంచలయ్య, అరుణ్ కటారి, రమణాచారి, నగేశ్, సునీల్‌రాజవు, కృష్ణ చైతన్య, సౌమ్య, సాయిమేఘన, సాయి ప్రీతమ్, తానా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

పురుమల్ల శ్రీనివాస్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కరీంనగర్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పురుమల్ల శ్రీనివాస్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ పూసాల సంపత్ కోరారు. సోమవారం కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ గడ్డు పరిస్థితుల్లో ఉన్న సమయంలో బీఆర్ఎస్ ఆగడాలను ఎత్తి చూపుతూ పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. ఆనాడు ఎవరూ లేని సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలకు మనోధైర్యాన్ని ఇచ్చిన శ్రీనివాస్ అనివార్య కారణాలతో సస్పెండ్ చేశారని తెలిపారు. బొమ్మకల్ సర్పంచ్‌గా, జడ్పీటీసీగా అన్నివర్గాల ప్రజలకు సేవలందించిన శ్రీనివాస్ ఎదుగుదల ఓర్వలేక పార్టీలోని కొంత మంది అగ్రవర్ణ శక్తులు హైకమాండ్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి సస్పెండ్‌కు కారణమయ్యాయని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించాలని, శ్రీనివాస్‌పై సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని కోరారు. లేని పక్షంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలు పార్టీకి దూరమయ్యే అవకాశాలున్నాయన్నారు. సమావే శంలో నేరెళ్ల శంకర్, మైలారం నాగరాజు, రాచకొండ ప్రభాకర్, చీకటి కుమార్, నేరెళ్ల లక్ష్మణ్ ఉన్నారు.

తైక్వాండోతో శారీరక పటిష్టం



ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఏసీపీ వేణుగోపాల్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో శిక్షణతో శారీరక పటిష్టత చేకూరుతుందని పీటీసీ ఏసీపీ సీహెచ్ వేణుగోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ అల్ఫోన్స్ ఉన్నత పాఠశాలలో సోమవారం తైక్వాండో మాస్టర్ ప్రవీణ్ కుమార్ మానస ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో శిక్షణ పొందుత్ను విద్యార్థులకు గ్రేడింగ్ పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు తమను తాము రక్షించుకోవడానికి తైక్వాండో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్, బొమ్మకల్ మాజీ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్‌తో కలిసి బెల్టులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, యోగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, న్యాయవాది జంగ శ్రీనివాస్, ప్రైవేట్ పెటా సంఘ కార్యదర్శి గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు.

అన్నారంలో ఘనంగా బీరప్ప బోనాలు



అన్నారంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

మానకొండూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో ఈనెల 4నుంచి జరుగుతున్న బీరప్ప బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం బోనాలు ఘనంగా జరిగాయి. గొల్ల, కుర్మల ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలతో బీరప్ప, కమరాతి అక్క మహంకాళి అమ్మవార్ల కల్యాణం సందర్భంగా మహిళలు మంగళహారతులు, ఒగ్గుడోలు, చప్పుళ్లతో కోలాట నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకొన్నారు. భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఒగ్గుడోలు కళాకారులు బండారిని చల్లుతూ కత్తులతో నిర్వహించిన సాహస విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కత్తెర్ల లక్ష్మయ్య, అట్ల కొండయ్య, శంబు శ్రీనివాస్, దాడి కనుకయ్య, దాడి ఐలయ్య, కత్తెర్ల వీరయ్య, మల్లయ్య, పోషాలు, సమ్మయ్య, పుల్లయ్య ఉన్నారు.

రూ.7450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7450 పలికింది. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారగరిష్ఠధర రూ.7450,కనిష్ఠధరరూ.7వేలు చెల్లించి పత్తికొనుగోళ్లు చేపట్టారు.

ముస్లిం విద్యార్థులను వెంటనే చేర్పించాలి

హుజూరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైనార్టీ రెసిడెన్స్‌హాస్టల్ పాఠశాలలో ముస్లింవిద్యార్థులను వెంటనే చేర్పించాలని తెలంగాణ ముస్లింఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్ అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి అప్పులపాలు కావద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన మైనార్టీపాఠశాలల్లో చేర్పించి వారిభవిష్యత్తు చక్కదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 9నుంచి 12వతరగతివరకు గణితం బోధించుటకు అతిథి అధ్యాపకులనియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌వనజ తెలిపారు. ఎంఎస్సీబీఈడీ చేసి, బోధనలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామని, డెమోద్వారా అభ్యర్థుల ఎంపిక చేస్తామని తెలిపారు. ఈనెల12న డెమో నిర్వహించనున్నట్లు వివరాలకుకళాశాల పనివేలల్లో సంప్రదించాలని కోరారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

గణేశ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానిమోదీ, కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పదవీబాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తైన సందర్భంగా సోమవారం తెలంగాణచౌక్‌లో సంబరాలు చేపట్టారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 11ఏళ్లుగా ప్రధాని మోదీ పాలన విజయవంతంగా సాగుతోందన్నారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ సర్వతోముఖాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, జిల్లా ప్రధానకార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘాల నిరసన

హుజూరాబాద్‌రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రజాసంఘాల, రైతు సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సిర్సపల్లి గ్రామసమీపంలోని గుట్టలలో చెత్తఆధారిత విద్యుత్తుప్లాంట్(ఎనర్జీ ప్లాంట్) ఏర్పాటు చేయవద్దంటూ కోరారు. సమీప గ్రామాల ప్రజలు అనారోగ్యా భారిన పడుతారని, అలాగే పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఎనర్జీ ప్లాంట్ నిర్మాణాన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. అంతకుముందు ప్లాంట్‌ను నిర్మించవద్దంటూ గ్రామస్థులు, రైతులు గ్రామం నుంచి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజా సంఘాల, రైతుల సంఘాల నాయకులు

లబ్ధిదారులకు విడతల వారీగా సాయం

జమ్మికుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం విడతల వారీగా రూ.5లక్షల సాయం అందిస్తుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్ అన్నారు. సోమవారం జమ్మికుంటలోని 8,22వార్డుల్లో ఇందిరమ్మఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులు భూమిపూజ చేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరిరేణుక తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో పది ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్‌నాయకులు బడుకోలు దేవేందర్‌రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ క్యాదర్శి నాగరాజు, గ్రామశాఖఅధ్యక్షుడు మాచమల్ల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని కొండన్నపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముగ్గుపోశారు. ఈసందర్భంగా మాజీసర్పంచ్ రేండ్ల జమున కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. రేండ్ల జమున మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదవారికి వరంలాంటిదని అన్నారు.

రెవెన్యూ సదస్సుకు భారీగా దరఖాస్తులు

వీణవంక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్‌లో రైతులసమస్యల పరిష్కారా నికి అధికారులు రెవెన్యూ సదస్సులు చేపట్టారు. కొర్కల్ రెవెన్యూ పరిధిలో రైతుల నుంచి వివిధ భూసమస్యలకు సంబంధించి 252దరఖాస్తులు వచ్చినుట్లు తహసీల్దార్ రజిత తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని కరీంపేట, అంబాలాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ సురేఖ ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంపేటలో 40, అంబాలాపూర్‌లో 17మంది రైతులు భూస మస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

గంగాధర: మండలంలోని రెండు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ అనుపమ తెలిపారు. కొండయ్యపల్లిలో 62, వెంకటయ్యపల్లిలో 40 వివిధ భూసమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు.

జమ్మికుంట రూరల్: భూభారతితో సమస్యలు పరిష్కారం అవుతాయని మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరిస్వప్న అన్నారు. సోమవారం మండలంలోని వావిలాల, నగురం, నాగారం, పాపక్కపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా 161దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ నల్లవెంకటొరెడ్డి తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగులలో 184 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కె కనుకయ్య తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిమ్మాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలం లింగంపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అలుగునూర్ వద్ద పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు, ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లు పిట్టల శ్రావణ్, కొమ్మ అనిల్, ఏలేటి నరేష్‌పై కేసులు నమో దు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రామడుగు క్రీడాకారులకు బంగారు పతకాలు



బహుమతులు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్సై

రామడుగు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్‌పోటీల్లో రామడుగుకు చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. ఈనెల 4నుంచి 6వరకు నల్గొండ జిల్లాలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్‌జిల్లా జట్టు ప్రథమస్థానం సాధించింది. ఈజట్టులో రామడుగు చెందిన ఏడుగురు క్రీడాకారులు ఉన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులతోపాటు కోచ్ మూల వెంకటేశ్, మేనేజర్ శ్రీకాంత్‌ను రామడుగు ఎస్ఐ ఎన్ రాజు సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్‌జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్, జిల్లా సంయుక్తకార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, పీఈటీలు శ్రీకాంత్, ఎడవెల్లి సాయికృష్ణ, అమర్, శివాజీ రాజు, సభ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి

● మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి

హుజూరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ హుజూరాబాద్‌లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నా రని, వారికి సరైన మైదానం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హుజూరాబాద్‌లో మినీస్టేడియం ఏర్పాటు చేయుటకు కళాశాలమైదానం, హైస్కూల్‌మైదానాలు అనుకూలంగా ఉన్నాయన్నారు. కేంద్రప్రభుత్వ నిధులతో మినీస్టేడియం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

హుజూరాబాద్: పట్టణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్‌కమిషనర్ సమ్మయ్య అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని 5,7వ వార్డుల్లో ప్రత్యేకపారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బతుకమ్మ సొర్లకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా పెరిగిన గడ్డి మొక్కలను, చెత్తాచెదారాన్ని జంగిల్ క్లియరెన్స్ చేశామన్నారు.

-హుజూరాబాద్ ఏరియాఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరెడ్డిని తెలంగాణ బీసీసిటిజన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చందుపట్లజనార్దన్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఏరియాఆస్పత్రికి నారాయణరెడ్డి సూపరింటెండెంట్‌గా రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

జమ్మికుంట: ప్రభుత్వ పాఠశాలల విలీనం మానుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి రాజిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర)పాఠశాలలో ఆయనమాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలలను మూసివేత దిశగా రాష్ట్రప్రభుత్వం ఆలోచనచేస్తోందన్నారు.

జమ్మికుంట రూరల్: మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో సోమవారం సీనియర్ నాయకుడు దేశినికోటి కలిసి పుష్పగుచ్ఛం అందజేసిఘనంగా సన్మానించారు.

తిమ్మాపూర్: మానకొండూర్ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌పార్టీజిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మంగళవారం ఉదయం 11గంటలకు అల్గునూర్‌లోని ఉన్నతి కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

రామడుగు: కొక్కెరకుంటకి చెందిన నిరుపేద ఒంటరి మహిళ కట్టభాగ్య ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. కొత్తపల్లిపట్టణానికి చెందిన శ్రీరామటిఫిన్ ఎంటర్ యజమాని సామల సురేష్ ఒకనెలకుసరిపడా నిత్యావసర సరకులు అందజేసి ఉదారతను చాటుకున్నాడు.

చిగురుమామిడి: మంత్రి మెప్పు కోసం రాజకీయ జన్మనిచ్చిన బీఆర్ఎస్ పార్టీని విమర్శించడం సిగ్గుచేటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. సోమవారం ఆయనమాట్లాడుతూ మాజీ జడ్పీటీసీ సభ్యుడు గీకురురవీందర్‌రెడ్డి బీఆర్ఎస్‌పార్టీని విమర్శించడం సిగ్గుచేటన్నారు.